# దుమ్ము

## - నిర్మల కొండెపూడి

వాసవి అటు చూస్తూనే పిల్లలిద్దరికీ జడలు వేసింది. అటు చూస్తూనే చపాతీలు కాల్చింది. గదులన్నీ తడి బట్టతో తుడిచింది. మధ్య మధ్య అటు తిరుగుతూనే పేపర్లూ పుస్తకాలూ సర్దింది. నిజానికి ఇందులో సగం పనులు రోజూ పనిమనిషి చేసేవే, ఎక్కడి దుమ్ము అక్కడే వదిలేస్తోందనే కోపంతో ఇవాళ చీపురు పట్టుకుంది. అసలు దుమ్ము ఎక్కడ వుందో మొదటిసారి కనబడింది. అంతా నాదే అనుకుని నమ్మకంగా నిద్ర పోయే గదిలో ఎన్ని మూలలు వున్నాయో తెలిసింది.

నీళ్ల మోటారు స్విచ్చి వెయ్యడానికి పెరటిలోకి వెడుతూ ఇంకోసారి అప్రయత్నంగా అటే చూసింది. ఆ మూలగా గోడదగ్గర నలిపి పడేసిన గులాబీరంగు కాయితం వుండ అలాగే వుంది. తను కదిలిపోయినట్టుగా అది కదల్దు కదా. ప్రాణం లేని వొట్టి ఉత్తరమ్ముక్క. అది చదివిన వాడు విస విసా చొక్కాలాగూ తగిలించుకుని బైటికి పోయాడు . చదవాల్సిన ఆమె చదవకుండానే సగం తెల్లబోయి, చదివాక నోరు తెరుచుకుని నిలబడిపోయింది. పీక నొక్కాలనిపించేంత కోపం వచ్చింది. రాసిన వాడి మీద కాదు, చదివిన వాడి మీద. అయినా, ఇదేం బుద్ధి..? అవతలి వాడు ఏమయినా రాయనీ గాక, తనని ఉద్దేశించి రాసినప్పుడు తనకు తెలీకుండా చదివి, చించి పడెయ్యడం ఏ రకమైన మర్యాద అవుతుందో అడగాలి. ఆ పని తనకు చాత కాదా..? అసలు ఉత్తరాలే చించుతున్నాడా..? కచేరీ అహ్వానాలు కూడా చించుతున్నాడా .. ఏమో ? ఎవరు చెబుతారు.? ఇది కూడా బుట్టలోకి విసిరికొట్టిందే అయివుంటుంది. గురితప్పడం వల్ల పొరబాట్న తనకి దొరికింది. ఇకనుంచి మిస్సయిన ఉత్తరాల కోసం చెత్తను బోర్లించి చూడాలా..? ..లేక అతని మొహంలో వెతికితే సరిపోతుందా..? ....మరి. నెల క్రితం మిస్సయినవైతే..? అప్పుడు వూరి చివరి చెత్తకుప్పలో కూలబడి వెతకాలేమో...బావుంది కదా...చాలా బావుంది.

www.sirimalle.com

అందుకా అంత చిరాకు..? ఏమంత ఘోరం జరిగిపోయిందని .. ఏముందసలు ఇందులో .. అనుకుంటు మళ్ళీ ఆ ఉత్తరం అందుకుంది. కవరు లేదు. కాబట్టి చిర్నామా గానీ, తేదీ గానీ తెలీదు. లేక తెలుస్తుందనే భయంతో నమిలి మింగేశాడో....నిప్పుల పెట్టెతో ఇస్త్రీ చేసినా కూడా సాపు కానంతగా నలిగిపోయిన అరతావు కాయితం మాత్రం వుంది. చివర్న సంతకమూ లేదు.

".....ఎడారిలాంటి హృదయంలో అమృతపు సోన మీ పాట.... వెళ్ళిపోతూ మీరిచ్చిన చిర్నవ్వు చాలు జన్మ జన్మ లకూ గుర్తు పెట్టుకుంటాను....మీరిచ్చిన ఆటోగ్రాఫ్ నాజీవిత ఆకాశంలో చందమామలా మెరుస్తోంది.."

మొత్తం కవిత్వమే..| కవిత్వం ఎంత బాగా వచ్చో చెప్పడం కోసమే రాసినట్టుగా వుంది. అందమైన వాక్యాలు చదివినవో, అల్లినవో గానీ అనేకం వున్నాయి. ఏ మాటకామాటే చెప్పాలి. దస్తూరీ ముత్యాల కోవలా వుంది.

ఎంత ఆలోచించినా అందులో తప్పేమీ అనిపించడం లేదు. ఇరవైయ్యేళ్ళ కుర్రాడి/ పోనీ కుర్రదాని భావోద్వేగానికి అది గుర్తు.

అంతకంటే పెద్ద వయసు వుండకూడదా అంటే వుండొచ్చేమో..తెలీదు. ఆటోగ్రాఫ్ అన్నాడు కాబట్టి అలా అనిపిస్తోంది.

ఆ వయసులో తను అలాగే రాసేది. మాధవ కూడా ఒక ఉత్తరం పెళ్ళికి ముందు తనకి రాశాడు. ఇంగ్లీషు తనకి ఎంత బాగా వచ్చో చెప్పడం కోసం రాసినట్టనిపించింది. తెలుగు మీడియంలో చదువుకున్న తనకి సగానికి పైగా అర్ధమే కాలేదు. ప్రేమ లేఖ అందుకుని పరవశించాల్సింది పోయి, నిఘంటువులు మోసుకుంటూ మేడమీద గిరగిర తిరిగింది.

ఈ పోలిక తెస్తే మాధవ ఇంకా ఏడుస్తాడేమో..అంటే ఏమిటి..? వాడు నేనూ నీకు ఒకటేనా.. అంటాడు..

కాదని చెప్పడానికైనా నా ఉత్తరాలు నేను ముందు చదవాలి కదా అనాలి... అప్పుడు ఇంకా కొంప మునుగుతుంది.

అసలు ఒక్కసారి కూడా కొంప మునక్కుండా వుండాలంటే పవిత్ర భారత మహిళ భర్త తో ఎలా మాట్లాడాలి..?

"ఛ వూరుకో, అంత చిన్నవాడితో నాకేమిటి చెప్పు. అనా..?"

అప్పుడు: పెద్దవాడైతే ఫర్వాలేదా: అని వెటకరిస్తాడేమో..

తనకేం చెప్పాలో తోచదు.

"మొహం చూడెలా ..సందేహం గా పెడుతుందో.... ఇదేమాట మా అక్కనో, వదిన్నో ఎవరైనా అంటే, చెవులు మూసుకుంటారు,

ఇది సంసార పక్షమైన ఆడది కాదు" అనుకుంటాడు కావచ్చు.

పైకి మాత్రం ఏమీ అనడు. అదే సమస్య.

అప్పుడేం చెప్పాలి? నీవే తల్లివి దండ్రియు, నీవే నా పతియు, గతియు, నీవే నా గురుడు, గుర్రుడు -నిజముగ మాధవా..? అనాలా..

వారానికోసారి ఇలా పాతివ్రత్యాన్ని రెన్యూవల్ చేయించుకుంటె సరిపోతుందా...

అది తన వల్ల కాదు.

ఇదెక్కడ గోల రా నాయనా..ఎక్కడున్నావురా ఓ ఉత్తర కుమారా...క్రూరా...ఏరా...నాకున్ లేఖ రాసి, నా పతిదేవుడి బి.పి- సుగరున్ పెంచిన నిన్నున్ చంపి, నీ రక్తముతో నా కేశ పాశమున్ సింగారించుకొనని యెడల నా పేరున్ వాసంతిక కానేరదు అనా.. అవును అలా రాసి దిన పత్రికలో అచ్చుకి ఇస్తే.. ఎలా వుంటుంది.? అసలు అట్నించి నరుక్కు రావడమే తేలికేమో

సిగ్గు సిగ్గు.. పదేళ్ళుగా సంసారం చేస్తున్న మొగుడికి చెప్పలేనిది, ముక్కూ మొహం తెలీని వాడికి చెప్పాలనుకోవడం ఎంత హేయం. సగటు అన్యోన్య దాంపత్యాల్లోకి ఇంత బోలుతనం ఎలా వచ్చిందో..

ఏమిటో పిచ్చిగోల.. ఇద్దరి ఆడాళ్ళ ప్రేమల మధ్య ఇరుక్కోవడం మగాడికి సంబరంగా వుంటుందేమో గానీ, ఇద్దరి మగాళ్ళ అజ్ఞానాల మధ్య ఇరుక్కోవడం ఆడదానికి చెప్పుకోలేనంత అవమానంగానే వుంటుంది.

www.sirimalle.com

అన్నట్టు అమలాపురం వాళ్ళకి తను ఇచ్చిన కచేరీ డేటు ఈ నెలాఖరులోనే కదా ., ఫోను చేసి ఆహ్వానం పంపుతామన్నారు. పంపారో లేదో..? ఒకవేళ పంపడమూ, చెత్తబుట్టలో చేరడమూ జరిగిపోయయేమో..

అసలు తన అనుమానం నిజమేనా..? ఈ పని చేసింది మాధవేనా..? ఇంకెవరు చేస్తారు..? పిల్లలా కాదు, ఎనిమిదేళ్ల నానిగాడా..? అయిదేళ్ల చంటిదా..? మూడేళ్ల బేబీనా..? వాళ్ళకేంపని... వాళ్ళు చెయ్యరు. అసలు ఎన్నాళ్ళనుంచీ జరుగుతోందో ఇది..? ఉత్తరాలందకపోవడానికి వెనకున్న కారణం ఇతని పోలీసింగా..? . .. అంటే గంట క్రితం వచ్చిన పోస్టు తనకే అన్నమాట. లోపలి గదిలోంచి తను వచ్చేలోపే చివాల్న వెళ్ళి అందుకుంటే అతనికేనేమో అనుకుంది. . ఒక్క పిసరు సందేహం కూడా రాలేదు.. ఈ లెక్కన స్నేహితురాళ్ళ నుంచి అందుకున్న ప్రతి ఉత్తరమూ సెకండ్ హ్యాండయిపోయాక తను చదివినవేనా..? వాళ్ల వ్యక్తిగత సంగతులు, బాధలు అన్నీ వీడికి తెల్సిపోయాయా.. ఛీ ఛీ

ఇతని బుర్రలో ఈ పురుగు ఎప్పుడు దూరిందో తెలీడంలేదు.

లేక ఈ పురుగుతో సహా పుట్టి పెరిగి తనను వొలిచి, వలపించుకున్నా గాని కళ్ళు మూసుకుపోయి నమ్మేసిందా..

అనుమానం వున్న చోట రామా అన్నా బూతుగానే కనబడుతుందిట..కమల పిన్ని అస్తమానూ అనేది. ఎందుకలా అనేదో, బాబాయికూడా ఇలానే వుండేవాడా..?

మనసు మొద్దుబారి పోయింది. తల కొట్టేసినట్టుగా వుంది. వున్నపళాన కూర్చీలో కూలబడి, ముల్లు గుచ్చుకున్నట్టు లేచి నిలబడి, బాల్కనీ అంతా కొలుస్తున్నట్టు నడవడం మొదలుపెట్టింది. పక్కింటి ఆవిడ పలకరింపుగా చూసి, మొహమాటంగా నవ్వి, గుమ్మానికున్న పరదా సరిచేసుకుని వెళ్ళిపోయింది.

తన ఇంటికి పరదా లేదు, జీవితానికి కూడా వుండకూడదనుకుంది. ఇదేమిటిలా జరిగింది..?

అంటే మొన్న బెంగుళూరు లో జరిగిపోయిన కచేరీ, అంతకు ముందు చెన్నైవాళ్ళు పంపిన అహ్వానం పోస్టుమ్యాన్ మారినందుకో ఇంకెందుకో కాదు, మొగుడుగారి మనసు మారినందుకు అందలేదన్న మాట. హాతోస్మి..

గత నెల్నాళ్ళుగా అతనిలో కనిపిస్తున్న మార్పు భ్రమ కాదు నిజమే. కారణం బోధపడిందిగా ..వీడికి నిలువెల్లా అసూయ...అందుకేనా ఆ సూటీపోటీ మాటలు..

మైగ్రెయిన్ తల్నొప్పో , ఆఫీసులో గొడవలో అనుకుంది గాని, అది కాదన్నమాట. తన కోసం ఎవరైనా వస్తే మధ్యలో వచ్చి కూచోవడం, పిల్లల్ని కసురుకోవడం, ఈ నెల్లో కాఫీపొడి ఇంత ఖర్చు ఎందుకయిందనడం .. అన్నిటికీ మూలాధారం ఇదేనా..?

"నా కోసం ఎందరో వస్తారు, నువు కాఫీ ఇచ్చి లోపలికెళ్ళు" అని పెళ్ళాల్ని కసిరినట్టుగా మొగుడ్ని ఎవరైనా అనగలరా..? అని బతగ్గలరా..?

ఎప్పుడు ఎలా చెప్పాలో గానీ, గాయపడకుండా సుతారం గా చెప్పాలి అని తను అనుకుంటునే వుంది. చాతకావడం లేదు. మొన్నటికి మొన్న ఆ పత్రిక వాళ్ళు ఇంటర్వ్యూ చేస్తున్నంతసేపూ '

"ఇదిగో ఏమోయ్, పాలవాడికి డబ్బులిచ్చావా.. లేదా.? పాత పేపర్లు అమ్మేవా లేదా..?సాయంత్రం కాలేజీనుంచి వస్తూ బియ్యం నువ్వే తెచ్చెయ్యి, మొన్నటివి కాదు అవి బాలేదు రాళ్ళున్నాయి...బాబిగాడి స్కూలు బ్యాగ్గు తెగిందన్నాడు గుర్తుందా..? ఇవాళ ఆ పని చూడు..నాంపల్లిలో మంచివి దొరుకుతాయి..." ట.

ఏమిటది..? వొచ్చిన వాళ్ళు ఏమనుకుంటారు. బుద్ధీ జ్ఞానం వుండక్కర్లెదా..? ..అంటే మీ ప్రపంచానికి ఈవిడ ఎంత గాయకురాలయినా గానీ నాకు ఉత్త పెళ్ళాం మాత్రమే సుమా..అని చెప్పడమేగా..

సగటు మగవాడ్ని అర్థం చేసుకోవడానికి ఏమంత శ్రమ పడక్కర్లేదు.

రానీ, ఇవాళ తేల్చేస్తాను, ఈ సారి పైకే అంది. ఆలోచన తీవ్రంగా కాల్చుతున్నప్పుడు వాసవి ఇంటి పని చచక చేస్తుంది. చాలా మంది ఆడవాళ్ళంతేనట...స్టవ్వుమీదున్న పెనాన్ని పొరబాట్న చేత్తో అందుకుని సింకులోకి విసిరెయ్యబోయింది.. చురుక్కున కాలితే సాలోచనగా చూసుకుంది.. కానీ ఏమిటో మంటనిపించలేదు. బొటన వేలూ, మధ్య వేలూ ఎర్రబడిపోయాయి.

బుర్ర అంతకంటే కాలిపోతోందన్నమాట..

www.sirimalle.com

"నీయవ్వ ఎవడే వాడు...వాడితో ఎందుకే నీ మాటలు..." అంటూ అక్క మొగుడిలాగా మొహమ్మీద అడిగేస్తే బావుడ్ను. ఫెళ్ళుమని జవాబు చెప్పడమొ, ఘొల్లుమని గోలెత్తిపోవడమో నేర్చుకుందును.

అబ్బే...వీడల్లా మామూలి మగాడిలా ఏమీ అడగడు.

గూటిలో దూరిన ఎలక పిల్లలాగా కాయితాల్నీ, ఉత్తరాల్నీ గల్లంతు చేస్తున్నాడు.

సాగితే బూతులు, లేకపోతే అనుబూతులు అన్నాడు మొన్న, డైరీలో కోట్ చేసుకున్న కృష్ణ శాస్త్రి వాక్యాలు చదివి,

తెల్లబోయింది తను, ఆ భాష చూసి కాదు, పరాయి డైరీలు చదివే అలవాటు చూసి,

నాకు తెలీని రహస్యాలు నీదగ్గరేమున్నాయి చెప్పు అన్నాడు పెళ్ళయిన కొత్తలో, డైరీ కొంటూంటే _ అదేదో ఎ.సర్టిఫికెట్ జోకులాగా తల్చుకుని తల్చుకుని నవ్వుకుంది తను.

పిల్లలు స్కూళ్లనుంచి వచ్చారు. ఫ్రిజ్ లో వున్న జామపళ్ళుకోసి చేతికిచ్చి ఆటలకి తరిమేసింది..

హోంవర్కు విషయం అడక్కుండా పంపించెయ్యడం వాళ్ళకి సంబరంగా వున్నట్టుంది, ఎగురుకుంటూ వెళ్ళిపోయారు.

వాసంతికెందుకో ఆ ఉత్తరం సంగతి ఏం కానట్టు వదిలెయ్యడం ఇష్టంలేదు, . తప్పు జరిగినట్టు చింపెయ్యడం అసలే ఇష్టం లేదు.

ఏదో చెయ్యాలి. ఔను .. దాచాలి..? చాలా ప్రాధాన్యత ఇవ్వాలి. రాసినవాడికోసం కాదు, తన వ్యక్తిత్వాన్ని గౌరవించుకోవడం కోసం.. ఎక్కడ..? ఎలా దాచాలి..? పుస్తకాల అరలోనా..? పట్టు చీరల కిందా..? టివి కిందా..?, ఫ్రిజ్ కున్న కవరులోనా..? ఉత్తరాల తీగలోనా.., ఊహు లాభంలేదు. ఈ ఇంట్లో తనది అని నమ్మదగిన చోటే లేదు. అన్నీ అందరూ కెలికి పడేసేవే..నడ్డి విరిగేలా ఊడ్చడానికి, కడిగి ముగ్గులు పెట్టడానికే తప్ప తనకే స్థానం లేదు. గోడమీదున్న సీతారామాభ్యాన్నమహ్.. ఫొటోలతో సహా ఎక్కడ ఏది తగిలించాలో ఎంపిక అతనిష్టం. తనకసలు గోడలమీద ఏదీ తగిలించడం నచ్చదు.

www.sirimalle.com

విసుగొచ్చి చివరికి ఉత్తరాన్ని డైనింగు టేబుల్ మీదున్న ఉప్పుడబ్బా కింద పెట్టింది. తాజ మహల్ ఆకారంలో వున్న పింగాణీ ఉప్పుడబ్బా మొదటి పెళ్ళిరోజు కానుకగా ఇచ్చాడు మాధవ.

చెల్లెలు షర్మిల కిసుక్కున నవ్వింది. కోపం వచ్చేసింది తనకి,

ఉప్పు డబ్బాలు, పప్పు డబ్బాలు, జాడీలు, బూజు కర్రలు- ప్రేమ కానుకలంటే అవి కావబ్బా...నాకేమి ఇష్టమో అది ఇవ్వాలి ఎంతో శృంగార భరితంగా చెప్పడాన్కి నోరు తెరిచిందా రాత్రి. . చెప్పలేకపోయింది. కారణం గుట్కా నోటితో అతను పెట్టిన ముద్దు.

మూర్ఛ వచ్చినంత పనయింది.

"ఈ అలవాటెప్పటినుంచీ" అనడిగింది.

"ఊరికే....ఉషారెక్కువైనప్పుడు.." అన్నాడు.

సరే పోన్లే...ఉషారు విషయంలో ఇద్దరికీ అభిప్రాయం కల్సింది కదా, ప్రకటన ఎలా వుంటే ఏం పోయింది అనుకుంది.

భార్యలంతా ఇంతే, పరమ పిచ్చి మొహాలు..మొగుడిలో ఎప్పుడూ వెలుతురు కోణాలే వెతుక్కుంటారు.

అయితే తను భార్య మాత్రమేనా.. స్నేహితురాలు కాదా.? మరి కాలేజీలో తిరిగిన మూడేళ్ల తిరుగుడికి అర్ధమేమిటి..?

వన్ బై టూ కాఫీలు తాగి పొద్దుపోయేదాకా పార్కులమ్మట తిరిగి ఇంట్లో వాళ్ళతో చివాట్లు తినడానికా..? ఇంక ఒకర్నొకరు ఏం అర్ధం చేసుకున్నట్టు.....

ఒకసారి అర్ధం చేసుకున్నది జీవితాంతం సరిపోదేమో .... పదేళ్ళకోసారి మళ్ళీ అర్ధం చేసుకోవడం మొదలుపెట్టాలేమో ..

అయినా అప్పుడు అర్థం చేసుకున్నది మాత్రం ఏముందిలే? సంగీతమంటే ఎంతిష్టమో, ఎన్ని కీర్తనలొచ్చో చెప్పింది. ఆరునూరయినా కచేరీలు ఇవ్వడం మాననని చెప్పింది. అందుకు ఒప్పుకున్నందుకు సంబరపడింది. నిజానికివన్నీ హక్కులు కదా, అభిరుచులు కదా, వీటికోసం ప్రార్థించడమేమిటి.? అనే సంగతి అప్పుడు తెలీదు.

అతనేం చెప్పాడు..? సిగరెట్ మానడం తన వల్ల కాదన్నాడు. జీతమంతా చేతిలో పెట్టేస్తానన్నాడు. సంసారానికి రథసారథి నువ్వే కదా అన్నాడు. వీకెండు మందు పార్టీలు తప్పవన్నాడు అయినా మెల్లిగా తప్పించుకుంటానన్నాడు..

ఇంతకంటే ఇంకేంకావాలి..? ఇద్దరికిద్దరం స్వతంత్ర వ్యక్తితాలతో ఉట్టిపడుతున్నామనుకున్నాం. కాదా మరి..? అది పండగ చేసుకునేందుకు ఒకే కూల్ డ్రింకు సీసాలో తలో స్ట్రా వేసుకుని నవ్వుకుంటూ తాగాం. అవాళ రోజు కంటే ఎక్కువ చనువిచ్చింది కూడా..ఎన్ని మాట్లాడుకున్నా గాని, అసలు మాట్లాడుకోని వాటితోనే జీవితం గడుస్తుందని అప్పుడు తెలీదు. ఇప్పుడు తెలిసీ లాభంలేదు..

ఆటలనుంచి పిల్లలొచ్చారు. అన్నాలు పెట్టి బలవంతాన నిద్రలోకి దింపేసింది. రోజూలాగా గోరుముద్దలు లేవు, కథలు లేవు, కాకరకాయలు లేవు. అసలేమీ లేవు. కొంప మునిగిపోయేంత మౌనం.

మాధవ వచ్చాడు, మామూలుగానే వుండటానికి ప్రయత్నించాడు. మీద చెయ్యి వేస్తే విసురుగా దూరం జరిగింది.

"ఓహో ఒంట్లో బాలేదా.. సరేలే.." అంటూ అటు తిరిగి పడుకున్నాడు. ఏం చెప్పాలో వాసవి తోచలేదు. బావుండనిది ఒంట్లో కాదు, మనసులో....అందామనుకుంది అనలేకపోయింది.

మర్నాడు గడిచింది, ఆ మర్నాడు గడిచింది. వారం అంతా అలాగే గడిచింది.

ఆరోజు పొద్దున్నే అతనికెదురుగా వున్న కుర్చీలో కూచుని ఒక్కొగుక్కా కాఫీ చప్పరిస్తూ వాసంతి చెప్పింది. "ఇవాళ మనం ఒకచోటికి వెడుతున్నాం."

"చీరల బేరానికా నాదగ్గర అంత బడ్జెట్ లేదు."

www.sirimalle.com

కాదు అన్నట్టు తలూపింది,

"మరి..? ఆస్పత్రికా, మళ్ళీ వచ్చిందా నడుంనొప్పి..?" ఆందోళనగా అడిగాడు...

"కాదు" అంది కప్పు బల్లమీద పెట్టి..

"చెప్పు మరి..."

"తినబోతూ రుచి అడగడమేందుకు...? వస్తావా..? రావా..? అది చెప్పు ముందు..?"

"వస్తాను, చస్తానా రాక, దేవీ గారి ఆజ్ఞ మరి.." ఛలోక్తి విసిరాడు., వాసవి నవ్వలేదు, మాట్లాడలేదు. మొహం తిప్పుకుని కప్పు సింకులో పెట్టే నెపంమీద లోపలికి వెళ్ళిపోయింది. తన ఎంగిలి కప్పు కూడా ఎప్పటిలాగా చేతికివ్వబోయి ఆమె పట్టించుకోక పోయేసరికి చచ్చినట్టు మోసుకుంటు వెనకే వచ్చాడు.

"ఎక్కడికి చెప్పు..?" మళ్ళీ అడిగాడు.

"చెప్పానుకదా ఒకసారి.." అంటూనే గదిలోకి జారుకుంది.

వాసంతి బీరువాలోంచి ఇస్త్రీ చీర తీసి కట్టుకుని కూచుంది. పౌరుషం ఎక్కువైనప్పుడు మంచి చీరలు కట్టడం అలవాటు.

"అదేమిటి వంటలేదా ఇవాళ," తేలుకుట్టినట్టు అడిగాడు.

"లేదు అంతకంటే ముఖ్యవిషయం వుంది, అది చూసుకుని హోటల్ లో తినేసి ఎవరి ఆఫీసుకు వాళ్ళం పోందాం..." అంది.

పిల్లల్ని పండక్కి అన్నగారింటికి పంపడం వల్ల, ఒంటరిగా దొరికిపోయాడు మాధవ. కొన్ని సున్నితమైన విషయాలు పిల్లల చెవిన పడకుండా ఇలా తేల్చుకోవడమే మేలని వాసంతి అనుకుంది.

చేసేది లేక ప్యాంటు చొక్కా మార్చుకుని వఛ్చాడు.

ఇంటికి తాళం బిగించింది వాసంతి.

www.sirimalle.com

గుమ్మం దాటగానే "ఆటో" అని పిలవబోయాడు....

"ఆమాత్రం నడవలేరా.. రండి, నడక ఆరోగ్యానికి మంచిది.." అంటూ చక చక నడవడం మొదలు పెట్టింది. ఒక ఫర్లాంగు నడిచాక పోస్టాఫీసు దగ్గర ఆగింది, నవ్వుతూ వెనక్కి చూసింది.

మాధవకి సందేహం వచ్చింది, "ఇక్కడికి.ఎందుకు....?" అడిగాడు తెల్లబోతూ..

అదే నవ్వుతో తలూపి, చెయ్యి పట్టుకుని లోపలికి లాక్కెళ్ళింది.. కౌంటరు దగ్గర ఆగింది. నోరు తెరిచి చెప్పింది.

"సార్, మా ఉత్తరాలు గల్లంతవుతున్నాయి, ఎందుకో తెలీడం లేదు. ఇదిగో వీరు మావారు. చార్మినార్ కంపెనీలో మార్కెట్ ఎగ్జిక్యూటివ్, పాపం వీరికీ కమ్యూనికేషన్ చాలా వుంటుంది. తనవి ఎన్ని మిస్సవుతున్నయో తెలీదు. అడ్రస్ మారిందా అంటే అదీ లేదు. ఎప్పటినుంచో వున్నదే, అయినా గత మూడు నెల్లుగా ఇది ఎక్కువయింది. అంతకు ముందు కూడా వుందేమో గానీ నేను తెలుసుకోలేకపోయాను. ఇప్పుడేం చెయ్యమంటారు.." అడిగింది.

జేబులోంచి సెల్ మోగినట్టు అభినయించి అది చెవిలో పెట్టుకుని అటు తిరిగి అందులో మునిగిపోయినట్టు కనిపించాడు మాధవ.

"సాధారణంగా అలా జరగదు మేడమ్, మనియార్డర్లు కూడా మిస్సయితే అప్పుడు యాక్షన్ తీసుకుంటాం... అయినా మీరు స్వయంగా ఎలాగూ వచ్చారు గాబట్టి, రిపోర్టు రాసి ఇవ్వండి..." అని చెప్పాడు కౌంటరులో వున్న వ్యక్తి.

వాసంతి రిపోర్టు రాసి ఇచ్చింది. "సంతకం పెట్టండి" అని భర్త ముందు పెట్టింది.

"నేనెందుకు" మొహం చిట్లించాడు.

"ఇవాళ నాకొచ్చిన సమస్య రేపు మీకు రాదంటారా..? ఎందుకైనా మంచిది మీరూ సంతకం చెయ్యండి..? ప్లీజ్ నాకోసం .." అంది.

ప్చ్.. అని విసుగు అభినయించి, "పెన్నులేదు" అన్నాడు జేబులో చెయ్యి పెట్టి,

www.sirimalle.com

"ఇదిగోండి సార్,," అని పోస్ట్ మేన్ అందించాడు. గభాల్న వాసంతి కూడా బ్యాగ్ లోంచి తీసి చేతికిచ్చింది. ఇద్దర్నీ ఒకేదెబ్బకి హత్య చేసేలా చూశాడు.

ఆ కోపం ఎందుకో పోస్ట్ మ్యాన్ కి అర్ధంకాలేదు. వాసంతికి బాగానే అర్ధం అయింది.

అతనికి టాటా చెప్పి ఆటో ఎక్కేదాకా ఉగ్గబట్టుకుని అప్పుడు నవ్వింది వాసంతి తెరలు తెరలుగా.. నవ్వి నవ్వి పొట్ట నొప్పెట్టింది. రోడ్డుమీద కొందరు విచిత్రంగా ఇటే చూస్తూ వెళ్ళారు.

కాలేజీకి చేరుకున్నాక ఫోన్ చేసి అడిగింది, "హెలో డార్లింగ్ చేరుకున్నావా జాగ్రత్తగా, అయ్యో, అన్నట్టు మనం కలిసి టిఫిన్ తినాలనుకునీ మర్చిపోయాం కదా హడావిడిలో పడి, నువ్వయినా గుర్తు చెయ్యచ్చు కదబ్బా." అంది ఏమీ జరగనట్టు,

అవతలినుంచి విసురుగా ఫోన్ పెట్టేసిన చప్పుడయింది.

ఇప్పటికి ఈ డోస్ చాలు, హమ్మయ్య ఉత్తరాల విషయంలో తను ఇంక భయపడక్కర్లేదు. అనుకుంది.

ఆమె అభిప్రాయం నిజమే అయింది. అది మొదలు ఏ ఉత్తరం ఎక్కడినుంచి రాసినా మచ్చికగొన్న పావురంలా అరచేతి మీదే వాలుతోంది..